గట్టుకాడిపల్లి రోడ్డుకు మోక్షం

- పీఎంజీఎస్‌వై నిధులు రూ.3 కోట్లు మంజూరు
- కంకరపై బీటీ వేసేందుకు సిద్ధం
- ఆనందం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



గట్టుకాడిపల్లి - మానాజీపేట రోడ్డుకు మెటల్ వేసి బీటీ వేసేందుకు సిద్ధం చేసిన అధికారులు

ఖిల్లాఘనపురం: గుంతలమయంగా మారిన తమ ఊరికి బీటీ రోడ్డు ఎప్పుడు పూర్తవుతుందోనని ఎదురు చూస్తున్న పల్లె ప్రజల కల నెరవేరనుంది. గట్టుకాడిపల్లి నుంచి మానాజీపేట వరకు బీటీరోడ్డు పూర్తి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే ఫార్మేషన్, మెటల్ పోసియించిన అధికారులు బీటీ వేసేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే జిల్లా స్థాయి అధికారులు రోడ్డును పరిశీలించి బీటీ వేయడానికి కాంట్రాక్టర్‌కు అనుమతులు ఇచ్చారు.

మండల కేంద్రం నుంచి

మండల కేంద్రం నుంచి మహ్మద్‌హుస్సేన్‌పల్లి, ఆగారం గ్రామాలకు వెళ్లే రోడ్డు నుంచి గట్టుకాడిపల్లి మీదుగా మానాజీపేట గ్రామం వరకు 4.4 కిలోమీటర్ల బీటీ రోడ్డు కోసం ప్రభుత్వం 2021–22 ఆర్థిక సంవత్సరంలో పీఎంజీఎస్‌వై నిధులు రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డులో వెంకటాంపల్లి నుంచి గట్టుకాడిపల్లి వరకు బీటీ రినివల్ కోట్ పనులు కాగా గట్టుకాడిపల్లి నుంచి మానాజీపేట వరకు నూతనంగా ఫార్మేషన్‌తో పాటుగా బీటీ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది.

పూర్తి కావచ్చిన పనులు

మండలంలోని గట్టుకాడినల్లి నుంచి మానాజీపేట వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులు పూర్తి కావచ్చాయి. ఫార్మేషన్‌తో పాటుగా మెటల్ వేయడంతో పాటు సైడు మట్టి ఇలా అన్ని పనులు పూర్తి చేశారు. గట్టుకాడిపల్లి నుంచి మహ్మద్‌హుస్సేన్‌పల్లి, ఆగారం గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు వరకు చేపట్టాల్సిన రినివల్ కోట్ పనులు గణపసముద్రం చెరువు పనుల వలన కాస్త ఆలస్యం అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



మానాజీపేట వద్ద ఏర్పాటు చేసిన టెండర్ బోర్డు

సంతోషంగా ఉంది



మా ఊరి నుంచి మానాజీపేట, మల్కాపురం, కందూర్‌తో పాటుగా ఎన్‌హెచ్ 44కు వెళ్లాలంటే ముందుగా ఖిల్లాఘనపురం వెళ్లి అక్కడి నుంచి మానాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వాళ్లం. వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడేవాళ్లం. ఇన్నేళ్లకు ఈ గుంతల బాటకు బీటీ రోడ్డు వేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– రాములు, గట్టుకాపడిపల్లి

వర్షం ఆగిన వెంటనే..



ఖిల్లాఘనపురం మండలంలోని గట్టుకాడిపల్లి నుంచి మానాజీపేట వరకు పీఎంజీఎస్‌వై పథకంలో మంజూరైన బీటీ రోడ్డు పనులు పూర్తి కావచ్చాయి. వర్షం కురుస్తున్నందుకు బీటీ వేయకుండా పనులు నిలిపి వేశాం. వర్షం ఆగిన వెంటనే బీటీ పనులు పూర్తి చేస్తాం. గట్టుకాడిపల్లి నుంచి గణపసముద్రం రిజర్వాయర్ వెనుక వైపు నుంచి ఆగారం రోడ్డు వరకు ఉన్న బీటీ రోడ్డు రినివల్ కోట్ పనులు రిజర్వాయర్ పనుల కారణంగా కాస్త ఆపాం.

– లక్ష్మీనారాయణరెడ్డి డీఈ పంచాయతీరాజ్ శాఖ, వనపర్తి

‘బీజేపీకి ఒక అవకాశం ఇవ్వండి’



ఖిల్లాఘనపురం నుంచి వనపర్తికి వెళ్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి రూరల్: భారతీయ జనతా పార్టీని ప్రజలు ఆదరించి ఒకసారి అవకాశం కల్పిస్తే రాష్ట్ర స్వరూపాన్ని మారుస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచంద్రరావు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా పర్యటన ముగించుకొని పెబ్బేరు పట్టణానికి వస్తున్న ఆయనకు రంగాపురం బైపాస్ వద్ద స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో పట్టణంలోని సుభాష్‌చౌరస్తాకు చేరుకొని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అభివృద్ధికి గత బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమిలేదని ఎద్దేవా చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికునిల్లా పనిచేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో పోతుగంటి భరత్‌ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు నారాయణ, లోక్‌నాథ్‌రెడ్డి, ఎలక్షన్ చీఫ్ ఏజెంట్ కొప్పు బాషా, అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, గౌని వేమారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, క్రాంతికుమార్, నాగరాజుయాదవ్ పాల్గొన్నారు.

జిల్లాకేంద్రానికి తరలిన బీజేపీ శ్రేణులు

ఖిల్లాఘనపురం: జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ర్యాలీకి మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల ఇన్‌చార్జి సీతారాములు, మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ అధ్యక్షతన యువకులు, నాయకులు, కార్యకర్తలు మోటర్‌సైకిళ్లపై ర్యాలీగా బయలుదేరారు. కార్యక్రమంలో రవినాయక్, సత్యనారాయణ, దశరథం, గోపాల్‌రెడ్డి, ఆశన్న, అక్బర్, భద్రయ్య, రవీంద్రాచారి, రాంచందర్, గోపిముదిరాజ్, హేమంత్, లాలునాయక్, శివ, రాజు, శేఖర్, కోరమోని అంజి, మల్లేష్ తరలివెళ్లారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

గోపాల్‌పేట: మండలంలో బీజేపీ పుంజుకుంటుందని, త్వరలోనే ఎక్కువ మొత్తంలో బీజేపీలోకి వలసలు ఉన్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పది మంది బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, సుధాకర్‌రావు, గుడ్లమల్లేష్, చెన్నయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 30న పెన్షన్‌దారులతో సమావేశం



మాట్లాడుతున్న చెన్నకేశవులు

కొత్తకోట రూరల్: చేయూత పెన్షన్‌దారులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చెన్నకేశవులు ఆరోపించారు. ఆదివారం మండలంలోని మిరాసిపల్లిలో చేయూత పెన్షనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే వికలాంగుల రూ.4వేలు ఉన్న పెన్షన్ రూ.6వేలు, చేయూత పెన్షన్ రూ.2016 నుంచి 4వేలు పెంచుతామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ 18 నెలలు పూర్తి కావస్తున్నా నేటికీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. పెన్షన్‌దారుల సంక్షేమంపై అధికార, ప్రతిపక్షాలకు ఆవగింజంత చిత్తశుద్ధి లేదన్నారు. ఆగస్టు 30న వికలాంగులు, చేయూత పెన్షన్‌దారులతో వనపర్తి జిల్లా సన్నాహక సభ నిర్వహిస్తున్నామని, సమావేశానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో మొగులన్న, రాములు, పరశురాముడు, ఆంజనేయులు, అశోక్, పరశురాం, శివ, మన్యం, చిన్న మొగులయ్య, నత్తి ఎల్లన్న, రమేష్, అబ్దుల్లా, శివయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం



అమరచింత: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ నూతన నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి వాకిటి శ్రీహరిని ఆహ్వానించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరిని ఆదివారం మక్తల్‌లోని ఆయన స్వగృహంలో కలిసి ఆగస్టు 14న జరిగే ఆలయాల నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందించారు. అదే విధంగా ఎంపీ డీకే అరుణను కలిసి ఆహ్వానించామని వారు తెలిపారు. కార్యక్రమంలో తాటికొండ రమేష్, సత్యనారాయణ, మరాఠీ ఆశోక్, మంత్రిసుదీర్, జాల్గి నరసింహ ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ పార్టీ మండల సమావేశం

చిన్నంబావి: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశాన్ని మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఈదన్నయాదవ్, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ, గోవిందు శ్రీధర్ రెడ్డి తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు రంగినేని అభిలాష్‌రావు హాజరవుతారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



వీపనగండ్ల: మండలంలోని వల్లభాపూర్ తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సింగిల్ విండో డైరెక్టర్‌తో పాటు మరో 20 మంది నాయకులు మంత్రి జూపల్లి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారని రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు చేస్తున్న అభివృద్ధి పనులకు మద్దతుగా ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రతి కుటుంబానికి లబ్ధి జరుగుతుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు తుడుచుకుపెట్టుకుపోతాయని జోస్యం చెప్పారు. పార్టీలో చేరిన వారిలో బాలియానాయక్, శంకర్‌నాయక్, శివుడు, బాషా, సూర్యనాయక్, దూదియా తదితరులు ఉన్నట్లు వారు తెలిపారు.

యాదవుల అభ్యున్నతికి కృషి



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఆదివారం శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం సభ్యులు సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కటిక చింతలయ్య, ప్రధాన కార్యదర్శిగా పెండెం సతీష్, గౌరవ అధ్యక్షుడిగా నక్క భాస్కర్, కన్వీనర్‌గా రాజు, కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ యాదవ సంఘం సభ్యులకు, యువతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో గీజర్‌ను వినియోగంలోకి తేవాలి



వీపనగండ్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నెలలుగా వేడి నీళ్ల కోసం వాడే గీజర్ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. వర్షాకాలంలో బాలికల స్నానాల కోసం వేడి నీళ్లు ఉపయోగించుకోవాలని రూ.వేలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా మారడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గీజర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

సీసీ పనులు ప్రారంభం



కొత్తకోట రూరల్: మండలంలోని పాలెం పైగడ్డ కాలనీలో అంతర్గత రోడ్డు సీసీకి నోచుకోకపోవడంతో ప్రజలు ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయాన్ని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ దృష్టికి బీజేపీ మండల అధ్యక్షుడు చీర్ల నర్సింహ తీసుకెళ్లడంతో.. స్పందించిన ఎంపీ తన నిధుల నుంచి రూ. 5లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో 125మీటర్ల పొడవున సీసీ రోడ్డుకు బీజేపీ నాయకులు ఆదివారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకటేష్,పెద్దిరవి, ఆంజనేయులు, కేశవులు, చీర్ల కురుమూర్తి, చింతల మహేష్,బోయ కురుమూర్తి,పోతుల శివ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



పాన్‌గల్: మండలంలోని రేమద్దుల శివారులో వ్యవసాయ పొలంలో ఎల్‌టీ విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయని రైతు రాములు పేర్కొన్నారు. తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను సరి చేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



వీపనగండ్ల: అనారోగ్యంతో బాధపడుతూ.. మెరుగైన చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం వరం లాంటిదని కాంగ్రెస్ నాయకులు చక్ర వెంకటేశ్వర్లు, వెంకటరాజయ్య అన్నారు. ఆదివారం కల్వరాలలో వినోద్‌కు రూ.35వేలు, జలకం శాంతమ్మకు రూ.22వేలు, జలకం రామచంద్రయ్యకు రూ. 21 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, రాము డు, మద్దిలేటి, భాస్కర్, నరసింహ, రామచంద్రయ్య, కృష్ణయ్య, నాగరాజు, జాని తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం నిర్వాసితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ధారాసింగ్

చిన్నంబావి: శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన నిర్వాసితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ధారాసింగ్ కోరారు. ఆయన ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెలుగులు అందించేందుకు తమ జీవితాలను కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నారే తప్పా.. వాటిని నేరవేర్చడం లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తమకు న్యాయం జరుగుతుందని పలు దఫాల్లో ఉద్యమించిన వారికి లాభం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. రానున్న స్థానిక ఎన్నికల్లో శ్రీశైలం నిర్వాసితులు మాట తప్పిన పార్టీలకు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గోపినాయుడు, తగరం నరసింహ, నాగేంద్రం, శేఖర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, జాని, సాయి ప్రణీత్‌గౌడ్, హరికాంత్, పురేందర్‌గౌడ్, నారాయణ, ఉదయ్, నాగమద్దిలెట్టి పాల్గొన్నారు.

‘బీసీలపై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలి’



మాట్లాడుతున్న రాములుయాదవ్

కొత్తకోట రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పర్యటనలో భాగంగా కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్‌కు వ్యతిరేకంగా ఎంపీ డీకే అరుణ వర్గీయులు నినాదాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ రాములుయాదవ్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీజేపీలో క్రియాశీలకంగా ఉన్న శాంతకుమార్‌పై విషం చిమ్మటం సరికాదన్నారు. ఆయన నిత్యం పార్టీ బలోపేతానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సమాజాన్ని ప్రోత్సహిస్తూ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నిలబడ్డారని తెలిపారు. శాంతకుమార్ లేకుండా మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానంలో బీజేపీ పార్టీ గెలిచేదా? ప్రస్తుత ఎంపీ డీకే అరుణ ఆత్మ విమర్శ చేసుకోవాలని హితువు పలికారు. బీసీలపై భారతీయ జనతా పార్టీ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చీర్ల నాగన్నసాగర్, వెంకటన్నగౌడ్, వహీద్, జాంగీర్, హోటల్ కురుమూర్తియాదవ్, షకీల్, మక్బూల్, పాలెం నరేందర్‌సాగర్ ఉన్నారు.

ఏపీజే అబ్దుల్‌కలాంకు ఘన నివాళి



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి విద్యావిభాగం: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిస్సైల్ మెన్‌గా కలాం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో చీర్ల విజయ్‌చందర్, వెంకటేశ్వర్లు, సత్యంసాగర్, శరవంద, విభూతి, నారాయణ, కిచ్చారెడ్డి, సాయిచరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజా రాజామ్‌ప్రకాశ్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి బూరోజుగిరిరాజా చారి, గంధం నాగరాజు, మండ్ల దేవన్ననాయుడు, బాలేమియా, చింతకుంట కురుమయ్య, మద్దిలేటి, శ్రీనివాసులు శెట్టి, రంగస్వామి, తిరుపతయ్య పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పట్టణంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీనివాసులు, కర్ణాకర్‌రెడ్డి, గోకరయ్య, సాయిరాం, ముస్తఫా, సంజీవ్, షకీల్, ఫిరోజ్, మక్బూల్, ముర్తుజా తదితరులు ఉన్నారు.



కొత్తకోటలో..

బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాములుయాదవ్, తిమ్మన్న, బాలు, కురుమూర్తియాదవ్, నజీర్, ముజీప్, వహీద్, వేణు, వెంకటన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

మహాసభల పోస్టర్లు విడుదల

కొల్లాపూర్: కల్వకుర్తి పట్టణంలో ఆగస్టు 1, 2 తేదీలలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్లను ఆదివారం కొల్లాపూర్‌లో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి యూసూఫ్ విడుదల చేసి మాట్లాడారు. మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకులు చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు బాల్‌నర్సింహ, ఫయాజ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నలు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, ఖాజామైనోద్దీన్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

కొల్లాపూర్: మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బెవిని ధర్మయ్య కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి

పెద్దకొత్తపల్లి: ఇందిరమ్మ మోడల్ హౌస్ ఇంటి నిర్మాణం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పూర్తయినట్లు ఎంపీడీఓ నాగేంద్రం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని కోరారు. నిబంధనల ప్రకారం నిర్మించుకున్న వారికి ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుందని తెలిపారు. మండలంలో 646 ఇళ్ల మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. చంద్రబండతండా మోడల్ విలేజ్‌లో 21 ఇళ్లకు గాను 10 ఇండ్లు నిర్మాణాలు పూర్తి దశకు చేరుకుందని వివరించారు. మిగతా 11 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రబండతండాలో బోగుబండారు ముత్యాలమ్మకు ఆదివారం లంబాడీలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకొని బంజార సాంప్రదాయ ప్రకారంగా పండుగను నిర్వహించారు. ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామ్‌లాల్, మాజీ ఉప సర్పంచ్ రవినాయక్, భాస్కర్, గోపాల్, దశరథం, లాల్, హార్యా పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాన్ని తొలగించండి



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి, రంగవరం గ్రామాల రోడ్డులో ప్రధాన మలుపుల వద్ద పలు విద్యుత్ స్తంభాలను రైతులు అమర్చుకోవడంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు చోట్ల బీటీ రోడ్డుకు అతి సమీపంలో ప్రమాదకరమైన మలుపుల వద్ద ఈ స్తంభాలు ఏర్పాటు చేశారన్నారు ఉన్నతాధికారులు స్పందించి వాటిని తొలగించే చర్యలు తీసుకోవాలని ఇరు గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.

వాహనాలు వేగంగా నడపొద్దు

కేటీదొడ్డి: మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రైయినీ ఎస్ఐ కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని నందిన్నె చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌సీ, లైసెన్స్, హెల్మెట్ లేని వాహనాలకు జరిమానా విధించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది రజినిబాబు, కృష్ణ, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్య తీర్చండి

గోపాల్‌పేట: ఏదుల మండలంలోని చెన్నారం గ్రామంలో కరెంటు అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా చిన్నపాటి గాలి, వాన వచ్చినా కరెంటు పోతోందని, తిరిగి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్ని అవాంతరాలు ఉన్నా కరెంటు సమస్య తలెత్తేది కాదని తెలిపారు. గ్రామంలో సబ్‌స్టేషన్ ఉండి కూడా కరెంటు లేకపోవడం విడ్డూరం అన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ శ్రీశైలం చొరవ తీసుకుని వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం 6 వేల మంది భక్తులు హాజరై మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసం కారణంగా జాతరలో భక్తులు లేకపోవడంతో తినుబండారాలు గుడారాలు వెలవెలబోయా యి. ఆర్టీసీ బస్సులు జనం లేక ఖాళీగా నడిచాయి.